సాక్షి బాపట్ల

శనివారం । 10 । జూన్ । 2023



గాలివాన బీభత్సం

వేమూరు: ఈదురుగాలులకు జంపని–వేమూరు మార్గంలో చెట్లు నేలవాలాయి. ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.



ఆర్జిత సేవలకు డిమాండ్

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు శుక్రవారం నిర్వహించిన ఆర్జిత సేవల్లో ఉభయ దాతలు విశేషంగా పాల్గొన్నారు. ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.



క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

విజయవాడ: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏడీసీపీ పి.వెంకటరత్నం తెలిపారు. జూనియర్ బాలబాలికల బాక్సింగ్ పోటీలను శుక్రవారం ఆమె ప్రారంభించారు.

న్యూస్‌రీల్

హజ్ యాత్ర ఆనందంగా సాగాలి

పెదకాకాని : పవిత్ర హజ్ యాత్ర ఆనందంగా సాగాలని డెప్యూటీ సీఎం, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అంజాద్‌బాషా చెప్పారు. రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో మూడోరోజు శుక్రవారం యాత్రకు బయలు దేరిన 170 మంది బస్సులను డెప్యూటీ సీఎం జెండా ఊపి ప్రారంభించారు. నంబూరులోని మదరసాలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హజ్ యాత్రా కేంద్రంలో ఈనెల 7వ తేదీ నుంచి రోజూ యాత్రికులు హజ్‌కు బయలు దేరుతున్న విషయం తెలిసిందే. శుక్రవారం యాత్రికుల బస్సులను జెండా ఊపి ప్రారంభించిన డెప్యూటీ సీఎం అంజాద్ బాషా వారికి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హజ్‌కు బయలుదేరే యాత్రికులు శుక్రవారం ఉదయమే మదరసాకు చేరుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బద్వేలు షేక్ గౌసల్ ఆజామ్, వక్ఫ్‌బోర్డు అధికారులు, జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యుడు సయ్యద్ సుభాని, మదరసా నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

16న మెగా జాబ్‌మేళా



రేపల్లె: నిరుద్యోగులు తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉపాధి కల్పనల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన నగరం ఎస్‌వీఆర్ఎం కళాశాలలో మెగా జాబ్‌మేళా జరగనుంది. దీనికి సంబంధించి పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా వాల్ పోస్టర్‌లను ఎంపీ విడుదల చేశారు. జాబ్‌మేళాకు 17 ప్రముఖ కంపెనీలు రానున్నాయన్నారు. విద్యార్హత, ఉద్యోగాన్ని బట్టి రూ.10వేల నుంచి రూ.35వేల వరకు వేతనాలు అందిస్తారన్నారు. పరిసర ప్రాంతాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వివరాలకు కళాశాలలో, 90323 84374, 8555901198 నంబర్లలో సంప్రదించాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్, ప్రిన్సిపాల్స్ హరికృష్ణ, పి.హనుమంతరావు పాల్గొన్నారు.

చిరుత కోసం గాలింపు ముమ్మరం



గురజాల : చిరుతపులి కోసం ఫారెస్టు అధికారులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. మొదటిరోజు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో చిరుతపులి జాడ కానరాలేదు. రెండో రోజు ఆ ప్రాంతంలో చిరుత వేలిముద్రలను ఫారెస్టు అధికారులు గుర్తించారు. కానీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రాంతంలోకి మాత్రం చిరుత రాలేదని ఫారెస్టు బీట్ అధికారి బి.వెంకటేశ్వర్లు నాయుడు వెల్లడించారు. సీసీ కెమెరాల స్థానాలను మార్పు చేస్తామని వివరించారు.

అంజన్న హుండీ ఆదాయం రూ.34.81 లక్షలు



అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన హుండీ ఆదాయం రూ.34.81 లక్షలు వచ్చినట్లు దేవస్థాన ఈఓ సుభద్ర శుక్రవారం తెలిపారు. దీంతోపాటు హుండీల్లో భక్తులు సమర్పించిన 24.400 మిల్లీ గ్రాముల బంగారం, 439 గ్రాముల వెండి, 21 యూఎస్ డాలర్లు, 10 మలేషియా పౌండ్లు, రియాల్స్ 2 లభ్యమయ్యాయని పేర్కొన్నారు. మొత్తం 90 రోజుల కాలానికి లెక్కింపు చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమాన్ని జె.పంగులూరు గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణాధికారి యు.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. దేవస్థాన సిబ్బంది హుండీ నగదును లెక్కించారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.1,100, గరిష్ట ధర రూ.2,400, మోడల్ ధర రూ.1,700 వరకు పలికింది.

పురోగతి 'పక్కా'గా ఉండాలి

జగనన్న కాలనీల్లో పక్కా గృహ నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

బాపట్ల: జగనన్న కాలనీలలోని పక్కా గృహాల నిర్మాణాలలో పురోగతి సాధనకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులతో ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు తమ గృహాలను వేగంగా నిర్మించుకునేలా అధికారులు రుణాలిప్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆయన ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. ఇందుకోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన సూచించారు. వేమూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చిన్నగంజాం, చీరాల ప్రాంతాలలో గృహనిర్మాణాల పురోగతి మరింత పెరగాలన్నారు. పునాది దశలో ఉన్న గృహాలు రూఫ్ దశకు, రూఫ్ లోనివి శ్లాబ్ దశకు, శ్లాబ్ దశవి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం కింద గుర్తించిన 176 పనులు త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజాప్రయోజనాలకోసం ఎంపిక చేసిన పనులు త్వరగా పూర్తి చేయాన్నారు. ఈనెల 12వ తేదీన ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభించనున్న నేపథ్యంలో నాడు–నేడు అభివృద్ధి పనులను మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా తనిఖీలు చేయాలన్నారు. అలాగే ప్రతి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలన ఉండాలన్నారు. జగనన్న విద్యాకానుక పథకం సామగ్రిని పరిశీలించాలన్నారు. రేపల్లె నియోజకవర్గంలో సంపూర్ణ పోషణ పనులు 78 శాతమే నమోదు అయ్యిందన్నారు. ఆప్రాంతంలో క్షేత్రస్థాయి పరిశీలన జరగాలన్నారు. సుస్థిరాభివద్ధి లక్ష్యాలను చేరుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రీసర్వే ప్రక్రియ సమగ్రంగా చేపట్టాలన్నారు. వైఎస్సార్ బీమా లబ్ధిదారుల నమోదు ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, గుంటూరు జెడ్పీ సీఈఓ జె.మోహన్ రావు, ప్రకాశం జెడ్పీ సీఈఓ బి.జాలిరెడ్డి, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేయాలి...

బాపట్ల: సన్సద్ ఆదర్శగ్రామ యోజన కింద ఎంపిక చేసిన గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. సన్సద్ ఆదర్శ గ్రామ యోజనపై జిల్లా స్థాయి కమిటీ తొలిసమావేశం శుక్రవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జరిగింది. గ్రామాల అభివృద్ధికి అధికారులు సమగ్ర ప్రణాళికలు రూపొందించి వాటిని అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. 2016లో పార్లమెంట్‌లో రూపొందించిన చట్టం మేరకు పార్లమెంట్ సభ్యులు ప్రతిఏటా ఒక గ్రామాన్ని దత్తత తీసుకుంటారన్నారు. దత్తత తీసుకున్న ఆ గ్రామాన్ని మూడేళ్లలో అన్నివిధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాల్సి ఉందన్నారు. పార్లమెంట్ సభ్యులు దత్తత తీసుకున్న గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి అధికారులు సమగ్ర ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఆ గ్రామాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాల్సి ఉందన్నారు. దీనికి ఎంపీ ల్యాడ్స్ నిధులు కేటాయించవచ్చన్నారు. ఆగ్రామాలలో 35 అంశాలలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునేలా అధికారులు పనిచేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో బాపట్ల పార్లమెంట్ సభ్యుడు నందిగం సురేష్, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావులు ఉన్నందున, గడిచిన మూడేళ్లలో ఆరు గ్రామాలను ఎంపిక చేసినట్లు వివరించారు. నిజాంపట్నం మండలం కొత్తపాలెం, కూచిపూడి, వేమూరు మండలం జంపని, చెరుకుపల్లిలోని పొన్నపల్లి, రేపల్లెలోని మూలగుంట, సంతమాగులూరులోని ఏల్చూరు గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. గ్రామాల వారీగా జరుగుతున్న పనులను ఆయన సమీక్షించారు.

నాడు–నేడు పనులు వేగవంతం



జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

బాపట్ల: విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే నాడు–నేడు కింద పాఠశాలలన్నింటిలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. బాపట్ల మండలం అప్పికట్ల గ్రామంలోని జడ్పీ ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.42 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ప్రతి తరగతి గదిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులపై ఆరా తీశారు. తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలోనే పనులు కొనసాగాలన్నారు. అనంతరం జగనన్న విద్యాకానుక కిట్‌లో వస్తువులను పరిశీలించారు. బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, డీఈఓ పీవీ రామారావు, తహసీల్దార్ సుధారాణి పాల్గొన్నారు.

18 మంది తహసీల్దార్ల బదిలీ

గుంటూరువెస్ట్ : జిల్లాలో 18 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బి.వి.ఆర్.సి.హెచ్.ప్రసాద్ మాచవరం నుంచి గుంటూరు కలెక్టరేట్‌కు, జి.సిద్ధార్థ గుంటూరు కలెక్టరేట్ నుంచి ప్రత్తిపాడు తహసీల్దార్‌గా, ఎం.లీలాసంజీవ కుమారి ప్రత్తిపాడు నుంచి నకరికల్లుకు, ఎస్.సురేష్‌ను నకరికల్లు నుంచి సత్తెనపల్లికి, కె.నగేష్‌ను సత్తెనపల్లి నుంచి మాచవరానికి, సీహెచ్.విజయజ్యోతికుమారి ఈపూరు నుంచి గుంటూరు కలెక్టరేట్‌కు, బి.కోటేశ్వరరావు కలెక్టరేట్ పల్నాడు నుంచి వెల్దుర్తికి, ఎం.డానియేల్ డీఏఓ గురజాల నుంచి గురజాల తహసీల్దార్‌గా, ఎస్.శివనాగిరెడ్డి గురజాల నుంచి గురజాల ఆర్డీఓ కార్యాలయానికి, పి.మస్తాన్ బెల్లంకొండ నుంచి సత్తెనపల్లి డీఏఓ కార్యాలయం, పి.ప్రవీణ్‌కుమార్ బొల్లాపల్లి నుంచి దాచేపల్లికి, మల్లికార్జునరావు రేపల్లెకు, జాన్‌పీటర్ రేపల్లె నుంచి డీఏఓ ఆఫీస్ రేపల్లెకు, డి.వెంకటేశ్వర్లు డీఏఓ ఆఫీస్ కలెక్టరేట్ తెనాలి నుంచి నిజాంపట్నంకు, ఎం.శిరీష నిజాంపట్నం నుంచి మేడికొండూరుకు, కరుణకుమార్ మేడికొండూరు నుంచి పల్నాడు డీఏఓ కార్యాలయానికి, సుజాత చేబ్రోలు నుంచి బాపట్ల జిల్లా కలెక్టరేట్‌కు, శ్రీకాంత్ కేదార్‌నాథ్‌ను కొల్లూరు నుంచి చేబ్రోలుకు బదిలీ చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి



సీఐ ఉమేష్‌ను సన్మానిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, అదనపు క్రైమ్ ఎస్పీ చంద్రశేఖర్, ఏఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు

నరసరావుపేట: రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జూన్ నెల నేర సమీక్ష నిర్వహించారు. స్పందన పిటిషన్లు, పోక్సో, గ్రేవ్, ప్రాపర్టీ, చీటింగ్, 174 సీఆర్‌పీసీ, మిస్సింగ్ కేసుల పరిష్కారం, గంజాయి, సారా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు. ఇటీవల పరిమితికిమించి ప్రజలతో వెళ్తున్న వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని, దీనిపై దృష్టి సారించాలని చెప్పారు. దీనిపై ట్రాక్టర్, ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. అయినా మారకుంటే చలానాలు విధించాలని, అవసరమైతే వాహనాన్ని సీజ్ చేయాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, క్రయవిక్రయాలపై కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. సారా తయారీ, క్రయవిక్రయాలపై నిఘా ఉంచాలని, కార్డన్ సెర్చ్‌లు, దాడులు చేపట్టాలని ఆదేశించారు. పోక్సో కేసులు, మహిళలపై జరిగే నేరాలు, ప్రాపర్టీ, మిస్సింగ్ కేసుల దర్యాప్తు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్ కేసులను తగ్గించాలన్నారు. ప్రజలతో మర్యాదగా మెలగాలని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. దిశ కాల్స్, 112, 100 ఎమర్జెన్సీ నంబర్ల నుంచి వచ్చే ఫోన్లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కోర్టు కేసులపై అప్రమత్తత అవసరమన్నారు. గతంలో సత్తెనపల్లి రూరల్, నరసరావుపేట టూటౌన్, అమరావతి పోలీసు స్టేషన్లలో సీఐలుగా పనిచేసి ఉత్తమ ప్రతిభ కనబర్చి బదిలీపై వెళ్లిన సీఐలు ఉమేష్, వెంకటరావు, శివప్రసాద్‌ను ఎస్పీ అభినందించి సన్మానించారు. ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్‌కే చంద్రశేఖర్, డీఎస్పీలు కేవీ మహేష్, బి.ఆదినారాయణ, పల్లపురాజు, షేక్ ఫర్హ్రుద్దీన్, దిశ డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

స్విమ్మర్ సుబ్బలక్ష్మికి రెండు అంతర్జాతీయ పతకాలు



అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో పతకాలు సాధించిన ఎ.వి.సుబ్బలక్ష్మి

విజయవాడ స్పోర్ట్స్: అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ దక్షిణ కొరియాలో ఇటీవల నిర్వహించిన ఆసియా–ఫసిఫిక్ మాస్టర్ గేమ్స్–2023 పోటీల్లో విజయవాడ మాస్టర్ అథ్లెట్ ఏవీ సుబ్బలక్ష్మి సత్తా చాటింది. 70–75 వయసు మహిళల విభాగంలో దేశం నుంచి స్విమ్మింగ్, 100 మీటర్ల రన్నింగ్ పోటీలకు సుబ్బలక్ష్మి ప్రాతినిధ్యం వహించింది. స్విమ్మింగ్ 50 మీటర్ల బ్యాక్ బ్రెస్ట్ స్ట్రోక్‌లో గోల్డ్ మెడల్, 100 మీటర్ల రన్నింగ్‌లో సిల్వర్ మెడల్‌ను ఆమె కైవసం చేసుకుంది. అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన ఆమెను కృష్ణా జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కె.గంగాధరరావు, ప్రసాదరావు అభినందించారు.

సీఎం పర్యటనను జయప్రదం చేద్దాం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: ఈనెల 12న పెదకూరపాడు నియోజకవర్గంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతం చేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చెప్పారు. సీఎం పర్యటన నేపథ్యంలో ప్రచార రథాలను శుక్రవారం క్రోసూరు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరూ సమష్టిగా పనిచేసి సీఎం పర్యటన ను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్రోసూరు ఎంపీపీ పి.కోటయ్య, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి నారు శ్రీనివాసరెడ్డి, ఈదా సాంబిరెడ్డి, పట్టేల శ్రీను, జెడ్పీటీసీ జమీలా గఫూర్, గార్లపాటి దాసు, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, అనుముల శ్రీనివాసరెడ్డి, పాశం శ్రీనివాసరెడ్డి, శ్యాంసన్, మేళం థామస్ పాల్గొన్నారు.

'హైలెవల్' ప్రగతి

వరాల 'బాట'




నిడివి : 20 కిలోమీటర్లకుపైగా

అంచనా వ్యయం : రూ.44.18 కోట్లు

ఇది అమరావతి–తుళ్లూరు రోడ్డు. దీని అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా వైకుంఠపురం వద్ద కల్వర్టు నిర్మాణం కోసం తీసుకొచ్చిన పైపులను చిత్రంలో చూడొచ్చు.

అభివృద్ధి 'వారధి'



నిడివి : 200 మీటర్లు

అంచనా వ్యయం : రూ.3 కోట్లు

అమరావతి మండలం పెదమద్దూరు వాగు వర్షాకాలంలో పొంగిపొర్లుతుంటుంది. ప్రజల రాకపోకలకు నరకం చూపిస్తుంటుంది. దీనిని గమనించిన ప్రభుత్వం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చొరవతో వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పనులు వేగంగా జరుగుతున్న దృశ్యాన్ని చిత్రంలో చూడొచ్చు.

అమరావతి, తుళ్లూరు మండలాల అభివృద్ధికి ప్రభుత్వం బాట వేస్తోంది. రెండు ప్రాంతాల మధ్య ఛిద్రమైన రహదారి ఆధునికీకరణకు చర్యలు చేపట్టింది. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగానే అమరావతి మండలం పెదమద్దూరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులూ చేపట్టింది. ఫలితంగా పెదకూరపాడు, తాడికొండ నియోజకవర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- మద్దూరు వాగుపై వారధి నిర్మాణం
- దశాబ్దాల కల సాకారం
- అమరావతి– తుళ్లూరు రోడ్డు ఆధునికీకరణ
- గతంలో పట్టించుకోని పాలకులు

అమరావతి: సుమారు ఏడెనిమిది ఏళ్ల క్రితం వేసిన అమరావతి–తుళ్లూరు రోడ్డు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తిగా ధ్వంసమైంది. ఫలితంగా రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 2019 ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఈ రోడ్డును ఆధునికీకరిస్తామని, పెదమద్దూరు వాగుపై హైలెవల్ బ్రిడ్జిని నిర్మించి ప్రజలకు అంకితం చేస్తామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రజలకు హామీ ఇచ్చారు. అన్నట్టుగానే గెలిచిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులు, మంత్రుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చారు. పరిపాలన, ఆర్థిక ఆమోదం అనంతరం ఎట్టకేలకు నిర్మాణ పనులు ప్రారంభమై శరవేగంగా సాగుతున్నాయి.

విజయవాడకు ఏకైకమార్గం

పెదకూరపాడు, క్రోసూరు, అచ్చంపేట అమరావతి మండలాల నుంచి విజయవాడ వెళ్లాలంటే అమరావతి–తుళ్లూరు రోడ్డే ఏకైక మార్గం. వర్షాకాలంలో ఈ రోడ్డుపై పెదమద్దూరు వాగు పొంగిపొర్లటం వల్ల రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. రాజధాని అంటూ ప్రగల్భాలు పలికిన గత ప్రభుత్వం ఈ రోడ్డు గురించి పట్టించుకోలేదు. ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దీంతో కష్టాలు శాశ్వతంగా తొలగిపోనున్నాయి. ప్రస్తుతం 20 కిలోమీటర్లకుపైగా రోడ్డును రూ.44.18 కోట్లతో ఆధునికీకరిస్తున్నారు. నిధులు పూర్తిస్థాయిలో మంజూరయ్యాయి. గత ఏడాది అక్టోబర్ 27న రోడ్డు నిర్మాణానికి భూమి పూజ జరిగింది.

దశాబ్దాల కల

పెదమద్దూరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం ఈ ప్రాంత వాసుల దశాబ్దాల కల. ఎప్పటి నుంచో దీనిపై ప్రతిపాదనలు ఉన్నా.. ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చొరవతో 200 మీటర్ల మేర హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 కోట్లతో శ్రీకారం చుట్టింది.


ఆరునెలల్లో పూర్తి



అమరావతి–తుళ్లూరు రోడ్డు, పెదమద్దూరు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఆరునెలల్లో పూర్తిచేసి ప్రారంభిస్తాం. ఈ రోడ్డు, బ్రిడ్జి రెండు నియోజకవర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయి. అలాగే అమరావతి నుంచి బెల్లంకొండ అడ్డరోడ్డు వరకు డబుల్‌రోడ్డు నిర్మాణంతోపాటు మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి ఈనెల 12న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

– నంబూరు శంకరరావు, ఎమ్మెల్యే, పెదకూరపాడు

30 ఏళ్ల కష్టాలకు చెల్లు



పెదమద్దూరు వాగు వల్ల 30 ఏళ్ల నుంచి కష్టాలే. మా ఊరి వద్ద వాగు పొంగితే రాకపోకలు ఆగిపోతాయి. ప్రజలు ఇబ్బందులు పడతారు. బ్రిడ్జి కావాలని ఎన్నోఏళ్లుగా అడుగుతున్నాం. ఇప్పటికి సాకారం అవుతోంది. చాలా సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే శంకరరావు కృషి వల్లే ఇది సాధ్యమైంది.

– రమావత్‌రామకృష్ణనాయక్, పెదమద్దూరు, అమరావతి మండలం

150 గ్రామాల ప్రజలకు ఉపయోగం



తుళ్లూరు నుంచి అమరావతి వరకు రోడ్డు నిర్మాణం వల్ల పెదకూరపాడు తాడికొండ నియోజకవర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. సుమారు 150 గ్రామాల ప్రజలు విజయవాడ త్వరగా వెళ్లడానికి సౌకర్యంగా ఉంటుంది. సమయం, డబ్బు ఆదా అవుతాయి.

– రాయల అప్పారావు, వైకుంఠపురం, అమరావతి మండలం

వివాహిత దారుణ హత్య



భారతీబాయి (ఫైల్)

పట్నంబజారు(గుంటూరు): వివాహితను అగంతకులు దారుణంగా హత్య చేసిన ఘటన గుంటూరులో శుక్రవారం జరిగింది. లాలాపేట పోలీసుల కథనం ప్రకారం కర్నూలు జిల్లా ఆత్మకూరుకు చెందిన ననావత్ భారతీబాయి 20 ఏళ్ల క్రితం గుంటూరు రూరల్ దాసరిపాలెంకు వలస వచ్చింది. మిర్చియార్డులో పనిచేసేది. కొన్నాళ్లుగా చుట్టుగుంటలోని ఓ టీస్టాల్‌లో పనిచేస్తోంది. ప్రస్తుతం నల్లచెరువు మూడోలైనులో తన కుమారుడు శివశంకర్ నాయక్‌తో కలిసి ఉంటోంది. భర్త బాలునాయక్‌తో విభేదాల వల్ల 20ఏళ్లుగా దూరంగా ఉంటుంది. మిర్చి యార్డులో పరిచయమైన ప్రతాప్‌రెడ్డితో సహజీవనం చేస్తోంది. శుక్రవారం టీస్టాల్‌కు పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంది. కుమారుడు శివశంకర్‌నాయక్ కూలి పనులకు వెళ్లాడు. అతను తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి భారతీబాయి రక్తపు మడుగులో మృతిచెంది పడి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించాడు. అగంతకులు కత్తితో విచక్షణా రహితంగా నరకడంతో భారతీబాయి మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ నచికేష్ షలేకే, లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓ సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది.

పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు

భారతీబాయి హత్యపై పోలీసులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వివాహేతర సంబంధం వల్ల హత్య జరిగిందా, లేక ఒంటరిగా ఉండటంతో ఎవరైనా అఘాయిత్యానికి ఒడిగట్టారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించి, పరిసరాల్లోని వ్యక్తులను ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని లాలాపేట ఎస్‌హెచ్‌ఓ సుబ్బారావు తెలిపారు. మృతురాలి కుమారుడు శివశంకర్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

జీపీఎస్‌తో సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు



భట్టిప్రోలు: పదవీ విరమణ చేసిన సీపీఎస్ ఉద్యోగుల జీవన ప్రమాణాన్ని మెరుగు పరచాలనే ఉద్దేశంతో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి జీపీఎస్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంపై ఏపీ సీపీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి గుర్రం మురళీ మోహన్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. జీపీఎస్ విధానం అమలు చేస్తున్నప్పుడు కనీస సర్వీస్‌ను పరిగణంలోకి తీసుకోవద్దని, అందరికి జీపీఎస్ విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు వివరించారు.

పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం

మార్టూరు: పరిశ్రమల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక రాయితీలతో కూడిన పథకాలను ప్రవేశ పెట్టిందని పల్నాడు, బాపట్ల జిల్లాల అధికారులు తెలిపారు. మార్టూరు గ్రానైట్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. రెండు జిల్లాల పారిశ్రామిక కేంద్ర అధికారులు సాంబయ్య, ఉమాశంకర్, శ్రీనివాసరెడ్డి ప్రభుత్వ పరంగా అందిస్తున్న రాయితీల గురించి అవగాహన కల్పించారు. సిడ్బి బ్యాంకు జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు రుణ సౌకర్యం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రానైట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఈ ఆంజనేయులు, ఇతర సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- జీపీఎస్ అమలు నిర్ణయంతో ఉద్యోగ సంఘాల్లో ఆనందోత్సాహాలు



మాట్లాడుతున్న ఎంపీ వెంకట రమణారావు, పక్కన మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజలు, ఉద్యోగుల సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తోంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పట్టణంలోని శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలను ఉద్యోగ సంఘాలు స్వాగతిస్తుంటే టీడీపీ, ఎల్లో మీడియాలు జీర్ణించుకోలేక పోతున్నాయని పేర్కొన్నారు. పెయిడ్ ఆర్టిస్టులను ఉద్యోగులుగా చిత్రీకరిస్తూ విషం కక్కుతున్నాయని విమర్శించారు. ఉద్యోగుల విశ్రాంత జీవనానికి పూర్తి భరోసా కలిస్తూ సీఎం తీసుకున్న జీపీఎస్ నిర్ణయంతో ఉద్యోగ సంఘాలు సంబరాలు చేసుకుంటున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధశాఖల్లో పని చేస్తున్న 10,000 మంది కాంటాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ తీసుకున్న నిర్ణయంతో ఆయా సంఘాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు.

విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేసిన ఘనుడు చంద్రబాబే..!

రాష్ట్రంలో విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేసిన ఘనుడు చంద్రబాబేనని మోపిదేవి అన్నారు. విద్యుత్ రంగాన్ని కుప్పకూల్చే విధంగా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తీసుకొన్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ బాషీర్‌బాగ్‌లో ప్రజలు చేసిన నిరసనలు అడ్డుకోగా దారుణంగా నలుగురిని కాల్చి చంపిన నీచ చరిత్ర చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. సమావేశంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు మోపిదేవి రాజీవ్, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్య పరిస్థితిపై ప్రతినెలా సర్వే

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి
- నరసరావుపేటలో అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



గర్భిణికి పోషకాహార కిట్టు అందజేస్తున్న కమిషన్ సభ్యురాలు పద్మావతి, పీడీ అరుణ

నరసరావుపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం తీసుకుంటున్న పిల్లల ఆరోగ్య పరిస్థితిపై ప్రతినెలా సర్వే నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి చెప్పారు. పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కొంతమంది బాలింతలు, గర్భవతులకు వైయస్సార్ సంపూర్ణ కిట్లను స్వయంగా పంపిణీ చేశారు. హాజరు పట్టిక, ప్రీస్కూలు బోధనా పద్ధతులు, ఎత్తు, బరువు రిజిస్టర్లు, టీహెచ్‌ఆర్ రిజిస్ట్రార్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పౌష్టికాహారాన్ని పరిశీలించి తల్లులకు రక్తహీనత నివారించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ రైస్‌ను వినియోగించుకోవాలని తల్లులకు సూచించారు. ఆకుకూరలు, ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. గుడ్‌టచ్ బాడ్‌టచ్ అంశాలపై బాలికలకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అవగాహన కల్పిస్తుందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకై రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ టీములతో బాలకార్మికులను గుర్తించి వారిని బడిలోకి పంపేందుకు చర్యలు తీసుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో పీడీ అరుణ, సీడీపీఓ ఉమామహేశ్వరి, సూపర్‌వైజరు గౌస్య పాల్గొన్నారు.

హక్కుల చట్టాలతో మోసాలకు చెక్

- వినియోగదారుల్లో అవగాహన అవసరం
- ట్రోల్ ఫ్రీ నంబర్ 167 కేటాయింపు



పొలంలో ధాన్యాన్ని తూకం వేస్తున్న దృశ్యం

బాపట్ల అర్బన్: వినియోగదారుల రక్షణ చట్టాన్ని మరింత పటిష్టంగా మార్చింది రాష్ట్ర ప్రభుత్వం. గతంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలోని ఆయా విభాగాలకు ఫిర్యాదుల కోసం వివిధ టోల్ ఫ్రీ నంబర్లను కేటాయించారు. అయితే మోసపోయిన సమయంలో ఏ నంబర్ ఎవరి పరిధిలోకి వస్తుందో తెలియక కొనుగోలుదారులు ఫిర్యాదు చేసేందుకు అవస్థలు పడేవారు. దీన్ని గమనించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాటినన్నిటిని కలపి ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ను ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నంబర్ 1967 ఏకైక నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో బాధితులు ఈ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే పరిష్కారం లభిస్తుంది.

మోసాలకు పసిగట్టడం ఇలా..

ఫిర్యాదులకు ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నంబర్ 1967 అందుబాటులోకి తెచ్చింది ప్రభుత్వం. పటిష్టంగా వినియోగదారుల రక్షణ చట్టం గుండుసూది నుంచి గూగుల్ సేవ వరకు ప్రారంభించి ఫార్మా కంపెనీలో కల్తీ వరకు రియల్ ఎస్టేట్ మోసం నుంచి కార్పొరేట్ ఈ- కామర్ సంస్థల దోపిడి వరకు ఎక్కడైనా సేవల్లో మోసం జరిగినా వస్తువుల్లో నాణ్యత లోపించిన వినియోగదారులు ఏమి చేయలేని పరిస్థితి. అలాంటి వాటిపై ఫిర్యాదులు, వినతులు సలహాల కోసం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. రాష్ట్ర పౌరసరఫరాల కార్యాలయంలో అందుబాటులో ఉంచింది. గతంలో రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు ఆహార పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయంలో ప్రజలు ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఎదుర్కనే వారి సమస్యలు పరిష్కరించేందుకు వివిధ టోల్ ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉండేవి. ఇందులో పౌరసరఫరాల శాఖకు సంబంధించి 18004250082/1967 టోల్ ఫ్రీ నెంబర్ కు ఒకే దేశం ఒకే రేషన్ ఫిర్యాదులకు 18004253157/14445 టోల్ ఫ్రీ నంబర్ రాష్ట్ర ఆహార భద్రత ఫిర్యాదులు సలహాలు సూచనలకు 18004252388/155235 టోల్ ఫ్రీ నెంబర్ తూనికలు కొలతల శాఖకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 18004254205 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉండేవి. దీంతో ఫిర్యాదులు ఒకరికి చేయడానికి బదులు మరో శాఖకు వెళ్లేవి. అంతేకాక వినియోగదారులు అన్ని నెంబర్లు గుర్తుంచుకోవడం కష్టంగా ఉండేది దీంతో ప్రజలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అన్ని టోల్ ఫ్రీ నంబర్లను అనుసంధానం చేస్తూ 1967 నంబరుతో విజయవాడలో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ను ఏర్పాటు చేశారు.

అన్ని రకాల ఫిర్యాదులు చేయవచ్చు

ఈ కాల్ సెంటర్ కు ప్రజలు వినియోగదారుల వ్యవహారాలు ఆహార పౌరసరఫరాల శాఖకు సంబంధించిన అన్ని రకాల ఫిర్యాదులు చేయవచ్చు. ముఖ్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో తూకాల్లో మోసాలు అధికంగా డబ్బులు తీసుకోవడం ధాన్యం సేకరణ, గ్యాస్ సిలెండర్లు, పెట్రోల్ బంకులు తూనికల కొలతల అవకతవకలపై ఫిర్యాదులు చేయవచ్చు. అలాగే సలహాలు సూచనలు ఇవ్వవచ్చు. చేసిన ఫిర్యాదులను సంబంధిత శాఖల పరిష్కారం నిమిత్తం పంపుతారు. అంతేకాక నిర్దేశించిన సమయం తర్వాత ఫిర్యాదు ఏది ఉందో ఎవరి వద్ద పెండింగ్‌లో ఉందో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది.

ప్రజా పంపిణీ వ్యవస్థకు టోల్ ఫ్రీ నంబర్



ప్రజా పంపిణీ వ్యవస్థ ధాన్యం కొనుగోలుకు సంబంధించి సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నంబరు 1967 ఏర్పాటు చేసింది. దీని ద్వారా వినియోగదారుల రక్షణ చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని నిర్ణయించింది. ఈ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ 1967 ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– గంధం రవీందర్, ఆర్డీఓ, బాపట్ల

సీఎం జగన్‌ను కలిసిన అటవీశాఖ ఉద్యోగులు



అద్దంకి రూరల్: కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసినందుకు అటవీశాఖ ఉద్యోగులు శుక్రవారం సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ఏపీ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోషియేషన్ గౌరవాధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి ద్వారా కలసి కృతజ్ఞతలు తెలిపినట్లు ఆ సంఘ యూనియన్ ప్రెసిడెంట్, అద్దంకి బీట్‌ఫారెస్ట్ ఆఫీసర్ కే రమేష్ తెలిపారు. ఎన్నో ఏళ్లగా ఎదురు చూస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆశను నెరవేర్చిన సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

వృద్ధాశ్రమం కోసం జోలిపట్టిన రామ్‌లక్ష్మణ్‌లు



చీరాల అర్బన్: సినీ ఫైట్ మాస్టర్లు రామ్‌లక్ష్మణ్‌లు అంటే తెలియనివారుండరు. ఎంతో పేరున్న ఫైట్ మాస్టర్లు ఒక్కసారిగా రోడ్లపై జోలిపట్టారు. ఇందేంటని చూసిన వారందరూ ఆశ్చర్యపోయారు. చివరికి వారు జోలిపట్టానికి కారణం తెలిసి వారి మానవత్వానికి హాట్సాఫ్ చెప్పారు.

వివరాలు.. చీరాల దండుబాటలో కోటయ్య వృద్ధాశ్రమం ఉంది. వృద్ధాశ్రమానికి ఆహార సేకరణకు ఆటో వాహనం అవసరమైంది. ఆ వాహనం కొనుగోలు నిమిత్తం పట్టణంలోని దుకాణాలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు, రహదారిపై వెళుతున్న ప్రజల నుంచి కొంత నగదును సేకరించారు. తమ సొంత సొమ్ముతో పాటు జోలిపట్టగా వచ్చిన నగదును ఆశ్రమ నిర్వాహకులకు అందించారు. సేవా కార్యక్రమంలో ప్రజలను కూడా భాగస్వామ్యం చేసేందుకే జోలిపట్టినట్లు చేపట్టామన్నారు. ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. నిస్వార్థ సేవతో ఎంతో మంది వృద్ధులకు ఆశ్రయం కల్పించిన దివంగత కోటయ్య సతీమణిని అభినందించారు.

సీడ్ టూ సీడ్ కిట్ అందజేయాలి



నెహ్రూనగర్: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులందరికి సీడ్ టూ సీడ్ కిట్స్, ఇతర పరికరాలు ప్రధాన మంత్రి అనుచిత జాతీ అభ్యుదయ యోజన (పీఎంఏజేఏవై) పథకం కింద అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి జిల్లా యంత్రాన్ని ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పీఎంఏజేఏవై పథకానికి సంబంధించి జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ పథకం అమలుకు సంబంధించి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కన్వీనర్‌గా, జిల్లా అగ్రికల్చర్ అధికారి సభ్యుడిగా, ఆర్‌వైఎస్ఎస్ ప్రాజెక్టు మేనేజర్ సభ్యుడిగా, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సభ్యుడిగా, ఏపీ ఆగ్రోస్ జిల్లా మేనేజర్ సభ్యుడిగా వ్యవహరిస్తారన్నారు.

చేనేత కార్మికులు సాంకేతిక సహకారం తీసుకోవాలి

చేనేత జౌళిశాఖ జిల్లా అధికారి వనజ



భట్టిప్రోలు చేనేత సొసైటీలో విచారణ చేపట్టిన బాపట్ల జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి వనజ

భట్టిప్రోలు: చేనేత కార్మికులు సాంకేతిక సహకారం తీసుకోవాలని చేనేత జౌళిశాఖ జిల్లా అధికారి వీరవల్లి వనజ అన్నారు. స్థానిక చేనేత సహాయ సహకార ఉత్పత్తి విక్రయ సంఘానికి లోకాయుక్త కేసు విచారణ శుక్రవారం చేపట్టారు. సొసైటీ మాజీ మేనేజర్ వంగర నాగేశ్వరరావు తనకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందలేదని, సొసైటీ నిర్వాహకులు నాగేశ్వరరావు ఏడు నెలల జీతం అదనంగా తీసుకున్నాడని ఇలా పలు ఆరోపణల నేపథ్యంలో నడుస్తున్న కేసు విషయమై ఆమె సొసైటీకి విచ్చేసి నూలు, పుస్తకాల నిర్వహణకు సంబంధించిన పుస్తకాలను వెరిఫికేషన్ చేశారు. వనజ మాట్లాడుతూ మాట్లాడుతూ అర్హులైన చేనేత కార్మికులకు ముద్ర లోన్‌లు అందించడం జరుగుతుందని తెలిపారు. డిఫాల్టర్ కాకుండా ఉన్నటువంటి వారికి రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు అందించడమే కాక 20 శాతం సబ్సిడీ లభిస్తుందని వివరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోని 72 సొసైటీలకు ఆర్ఎంఎస్ పథకం కింద 15 శాతం సబ్సిడీపై నూలు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సొసైటీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చేనేత ఉత్పత్తుల పేరుతో మరమగ్గాలపై తయారు చేసిన వస్త్రాలను అమ్మకాలు చేస్తే శిక్షార్హులవుతారని పేర్కొన్నారు. చేనేత వస్త్రాలను అమ్మకాలు చేసే వారు విధిగా గుర్తింపు మార్కు ఉంచాలన్నారు. విచారణలో సొసైటీ అధ్యక్షులు కొతరపు పిచ్చయ్యశాస్త్రి, చేనేత జౌళిశాఖ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, ప్రశాంత్, క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పి.బాలకృష్ణ ఉన్నారు.

హెచ్‌ఐవీ బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడాలి



మాట్లాడుతున్న వీరాస్వామి, వేదికపై రత్నకుమార్, రవికుమార్, శ్రీనివాస శాస్త్రి

బాపట్ల అర్బన్: హెచ్‌ఐవీ బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం పర్యవేక్షణ అధికారి పి.శ్రీవిద్య సూచించారు. మండలంలోని నందిరాజు తోటలోని గ్రామసిరి ప్రాజెక్టు కార్యాలయంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, షేర్ ఇండియా సహకారంతో ఏఆర్‌టీ మందులు హెచ్‌ఐవీ బాధితులకు శుక్రవారం పంపిణీ చేశారు. జిల్లా సూపర్‌వైజర్ జే వీరాస్వామి మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. ఉచితంగా ఏఆర్‌టీ మందులు పంపిణీ చేస్తుందన్నారు. షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ కే రత్నకుమార్ మాట్లాడుతూ ఏఆర్‌టీ మందులు వాడుతున్న వారు క్రమం తప్పకుండా సీడీ- 4 వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఫీల్డ్ ఆఫీసర్ కే రవికుమార్, గ్రామసిరి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాస శాస్త్రి మాట్లాడారు. అనంతరం హెచ్‌ఐవీ బాధితులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ కే వెంకటరావు, ఎం అండ్ ఈ కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జేవీకే కిట్లలో ఎటువంటి రాజీ లేదు



జేవీకే కిట్లను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి రామారావు

కారంచేడు: ప్రభుత్వం ఉచితంగా అందించే జేవీకే కిట్ల నాణ్యతలో రాజీ పడకుండా చర్యలు తీసుకున్నామని బాపట్ల జిల్లా కోఆపరేటివ్ అధికారి, మండల ప్రత్యేక అధికారి కేవీ రామారావు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జేవీకే కిట్లను తనిఖీ చేశారు. ఈవిద్యా సంవత్సరం ప్రారంభ సమయానికి ఎంత మంది విద్యార్థులు నూతనంగా చేరే అవకాశాలు.. అందరికీ అవసరమైన కిట్లు పాఠశాలలకు చేరాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. బ్యాగులు, షూ, సాక్సులు, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్ వంటి అన్ని అందుబాటులో ఉన్నాయని ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం ఆయన గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు తక్కువగా ఉండే చిన్నారులపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారికి అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డీ విజయలక్ష్మి, ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ, హెచ్ఎం ఎంవీ సుబ్బారావు పాల్గొన్నారు.

అవాస్తవాలను ఎవరూ నమ్మవద్దు

తాడేపల్లిరూరల్: ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తుంటే కొంతమంది పనిగట్టుకుని అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, ఆ ప్రచారాలను ఎవరూ నమ్మవద్దని నూటికి నూరు శాతం సీఆర్‌డీఏ పరిధిలో ఇచ్చి లే అవుట్లలో శంకుస్థాపన నిర్వహించి ఇళ్లు నిర్మించి ఇస్తామని మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం నిడమర్రు లే అవుట్‌లో మంగళగిరి పట్టణానికి చెందిన మార్కండేయ కాలనీ, టిప్పర్ల బజార్, బ్యాంక్ కాలనీ, బాపనయ్య నగర్, భగత్‌సింగ్ నగర్‌లో సొంత ఇల్లు లేని 1100 మంది అక్కా చెల్లెమ్మల కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్కే ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలసి ఇళ్లపట్టాల పంపిణీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెత్తందార్లకు, పేదలకు మధ్య పోరాటం జరుగుతోందని, కొంతమంది పెత్తం దారులు పేదల జీవితాలు బాగుపడకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తూ, అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, సీఆర్‌డీఏ పరిధిలో ఏర్పాటు చేసిన 25 లే అవుట్లలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 50 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇస్తున్నట్లు గత నెల 26వ తేదీన ప్రకటించారు, అప్పటి నుంచి నిరంతరం గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాలో పేద అక్కా చెల్లెమ్మల కుటుంబాలకు ప్లాట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిరోజూ నిర్వహిస్తున్నాం. అది తట్టుకోలేని కొంతమంది కడుపు ఉబ్బరంతో అనేక విష ప్రచారాలు చేస్తున్నారని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ప్రతి అక్కా చెల్లెమ్మలకు కేటాయించిన సెంటు స్థలం విలువ 10 నుంచి 15 లక్షల ఉందని, ఆరు నెలల్లో ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తే అక్కాచెల్లెమ్మల పేరు మీద రూ.20 లక్షల ఆస్తి ఉన్నట్లేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మంగళగిరి పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు, పిరోజ్, నసీముల్లా, శేషిరెడ్డి పాల్గొన్నారు.